# బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శనివారం 23 నవంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4


## నేడే ఓట్ల లెక్కింపు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఈ నెల 20తో మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఝారండ్ కు రెండు విడతల్లో పోలింగ్ జరగ్గా, మహారాష్ట్రలో ఒక్క విడతలోనే పోలింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో, నేడు ఈ రెండు రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. దాంతో, దేశవ్యాప్తంగా అందరి దృష్టి ఈ రెండు రాష్ట్రాలపైనే ఉంది. ప్రధాన పార్టీలు బీజేపీ, కాంగ్రెస్ ఎవరికి వారే విజయం తమదే అని ధీమాగా ఉన్నాయి.. ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. మొదట పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు. మహారాష్ట్రలో మొత్తం 288 అసెంబ్లీ స్థానాలు ఉండగా... బీజేపీ-శివసేన (షిండే)-ఎన్సీపీ (అజిత్ పవార్) మహాయుతి కూటమి ఓవైపు... కాంగ్రెస్-శివసేన (ఉద్ధవ్ థాకరే)-ఎన్సీపీ (ఎస్ సీపీ)లతో కూడిన మహా వికాస్ అఘాడీ కూటమి మరోవైపు ఎన్నికల్లో హెూరాహెూరీ తలపడ్డాయి.

ఇక, ఝారండ్ లో రెండు విడతల్లో పోలింగ్ జరిగింది. మొత్తం 81 స్థానాలు ఉండగా... ఈ నెల 13న జరిగిన తొలి విడతలో 43 స్థానాలకు, ఈ నెల 20న జరిగిన రెండో విడతలో 38 స్థానాలకు పోలింగ్ జరిగింది. ఇక్కడ కూడా నువ్వా నేనా అన్నట్టుగా అధికార జేఎంఎం-కాంగ్రెస్ నాయకత్వంలోని కూటమికి... బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమికి పోరు జరిగింది.

### ఎమ్మెల్యేల అనర్హతపై
# స్పీకర్ నిర్ణయం తీసుకోవాలి

- శాసనసభాపతికి ఎలాంటి టైమ్ బాండ్ లేదు
- సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేసిన సీజే ధర్మాసనం




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పార్టీ మారిన ఎమ్మెల్యేలపై స్పీకర్ తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ హైకోర్టు సూచించింది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం, 10వ షెడ్యూల్, అసెంబ్లీ 5 ఏళ్ల గడువును దృష్టిలో ఉంచుకొని స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సీజే ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును హైకోర్టు కొట్టివేసింది. శాసనసభాపతికి ఎలాంటి టైమ్ బాండ్ లేదు అని తెలిపింది.

బీఆర్ఎస్ తరఫున గెలిచిన స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ చేరారు. వారిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కె.పి వివేకానంద్‌లో పిటిషన్లు దాఖలు చేశారు. ఎమ్మెల్యేలపై వచ్చిన ఫిర్యాదులను స్పీకర్ ముందుంచాలని, విచారణకు తేదీలు నిర్ణయించి 4 వారాల్లో రిజిస్ట్రీకి సమాచారం ఇవ్వాలని సింగిల్ బెంచ్ సెప్టెంబర్ 9వ తేదీన తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ అసెంబ్లీ కార్యదర్శి సీజే ధర్మాసనంలో అప్పీలు దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్ రావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై స్పీకర్ తగిన సమయంలో నిర్ణయం తీసుకోపోతే హైకోర్టు జోక్యం చేసుకునే అధికారం ఉంటుందని బీఆర్ఎస్ తరపు న్యాయవాది గండ్ర మోహన్ రావు వాదన వినిపించారు. స్పీకర్ స్వయంప్రతిపత్తి కలిగి ఉంటారని ఆయన నిర్ణయం తీసుకోకముందే హైకోర్టు జోక్యం చేసుకోరాదని అసెంబ్లీ కార్యదర్శి తరపున అడ్వకేట్ జనరల్, పార్టీ మారిన ఎమ్మెల్యేల తరపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఈ మేరకు ఇరువైపుల న్యాయవాదులు సుప్రీం కోర్టు తీర్పులతో పాటు పలు హైకోర్టులకు సంబంధించిన తీర్పులను ప్రస్తావించారు. ఇరువైపుల ఇది వరకే వాదనలు ముగియడంతో సీజే ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది. ఈ రోజు వెలువరించిన తీర్పులో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హతా వేటు వేయాలంటూ అందిన ఫిర్యాదులపై తగిన నిర్ణయం తీసుకోవాలంటూ స్పీకర్‌కు సూచిస్తూ పిటిషన్‌లపై విచారణ ముగించింది.

# రూ. 5,260 కోట్ల పెట్టుబడులు

## 12 వేల మందికి ఉద్యోగాలు..
## రాష్ట్ర ప్రభుత్వంతో 6 ఫార్మా కంపెనీల ఒప్పందం




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కాలుష్య రహిత యూనిట్ల ఏర్పాటుకు ప్రముఖ ఫార్మా దిగ్గజ కంపెనీలు హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులకు ముందుకు వచ్చాయి. తమ కార్యకలాపాల విస్తరణతో పాటు గ్రీన్ ఫార్మా కంపెనీలను నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి.

సచివాలయంలో వివిధ ఫార్మా కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సంప్రదింపులు అనంతరం ఎంవోయూలపై ప్రతినిధులు, అధికారులు సంతకాలు చేశారు. ఎంఎస్ఎన్ గ్రూప్, లారస్ ల్యాబ్స్, గ్లాండ్ ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ లాబోరేటరీస్, అరబిందో ఫార్మా, హెటిరో ల్యాబ్స్ కంపెనీలతో ఎంవోయూలు జరిగాయి. ఈ ఆరు కంపెనీలు దాదాపు రూ.5,260 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. ఈ కంపెనీల విస్తరణ కార్యకలాపాల వల్ల ఫార్మా రంగంలో 12,490 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఇప్పటికే గుర్తించిన ఫార్మా సిటీలో వీటికి అవసరమైన యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం స్థలాలు కేటాయించనుంది. ముఖ్యమంత్రితో సమావేశమైన కంపెనీల జాబితాలో ఎంఎస్?ఎన్ గ్రూప్, లారస్ ల్యాబ్స్, గ్లాండ్ ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ లాబోరేటరీస్, అరబిందో ఫార్మా, హెటిరో ల్యాబ్స్ ప్రతినిధులు ఉన్నారు.

**ఎంవోయూల ప్రకారం..**

ఎంఎస్ఎన్ ల్యాబ్స్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌తో పాటు ఆర్ అండ్ డీ సెంటర్ ఏర్పాటు చేస్తుంది.లారస్ ల్యాబ్స్, అరబిందోలు ఫార్ములేషన్ యూనిట్లు నెలకొల్పుతాయి. గ్లాండ్ ఫార్మా ఆర్ అండ్ డీ సెంటర్, ఇంజెక్టబుల్స్, డ్రగ్ సబ్‌స్టన్స్ మాన్యుఫాక్చర్ యూనిట్లను స్థాపిస్తుంది. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ ఇంజెక్టబుల్స్, బయో సిమిలర్స్ యూనిట్ ఏర్పాటు చేస్తుంది. హెటిరో గ్రూప్ ఫినిషిడ్ డోస్, ఇంజెక్టబుల్స్ తయారీ పరిశ్రమ నెలకొల్పుతుంది. మరో నాలుగు నెలల్లో ఈ ఫార్మా కంపెనీలు తమ నిర్మాణ పనులు చేపట్టేందుకు వీలుగా స్థలాలను కేటాయించటంతో పాటు, ఫార్మా సిటీలో అవసరమైన సదుపాయాలు కల్పించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ అవగాహన ఒప్పందాల సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి గారు, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ గారు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి , పరిశ్రమలు (పెట్టుబడులు) ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.కంపెనీల తరఫున డాక్టర్ రెడ్డీ ల్యాబ్స్ డైరెక్టర్ సతీష్‌రెడ్డి , లారస్ ల్యాబ్స్ ఈడీ వివి రవికుమార్, గ్లాండ్ ఫార్మా సీఈవో శ్రీనివాస్, ఎంఎస్ఎన్ ల్యాబ్స్ సీఎండీ ఎంఎస్ఎన్ రెడ్డి గారు, అరబిందో డైరెక్టర్ మదన్‌మోహన్ రెడ్డి, హెటిరో గ్రూప్ ఎండీ బి.వంశీకృష్ణ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# కోటి దాటిన కులగణన



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే శుక్రవారం నాటికి మరో కీలక మైలు రాయి దాటింది. అతి తక్కువ వ్యవధిలోనే రాష్ట్రంలో కోటి కుటుంబాల గణనను పూర్తి చేసింది. నవంబర్ 6వ తేదీన మొదలైన ఈ సర్వే ద్వారా ఇప్పటివరకు 16 రోజుల్లో ఒక కోటి కుటుంబాల గణనను పూర్తి చేసింది. ఇంత తక్కువ సమయంలోనే కోటి కుటుంబాల వివరాలను సేకరించి కొత్త రికార్డు నెలకొల్పింది.

మొత్తం 33 జిల్లాల్లో శుక్రవారం నాటికి దాదాపు ఎనిమిది జిల్లాల్లో సర్వే పూర్తయింది. ములుగు, జనగాం జిల్లాల్లో వందకు వంద శాతం పూర్తి కాగా నల్గొండ, మెదక్‌లో 9.9%, యాదాద్రి భువనగిరి, జగిత్యాల, గద్వాలలో 99% శాతం సర్వే పూర్తయింది. కామారెడ్డిలో 98.5%, మంచిర్యాల, అసిఫాబాద్, నిజామాబాద్, సిరిసిల్ల జిల్లాల్లో 98 శాతం సర్వే జరిగింది. వేరే ప్రాంతాల్లో నివాసముంటున్న వారు, ఇండ్లకు తాళాలున్నవి.. ఇలాంటివి మినహాయిస్తే వీటన్నింటా సర్వే పూర్తయిందని అధికారులు తెలిపారు.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా,ఉద్యోగ, రాజకీయ, కుల గణన సర్వే జనగాం, ములుగు జిల్లాలలో గురువారం నాటికి వంద శాతం సర్వే పూర్తయింది. నల్గొండ జిల్లా 99.7 శాతం పూర్తిచేసుకుని వంద శాతం లక్ష్యానికి చేరువలో ఉంది. కామారెడ్డి, మంచిర్యాల, యాదాద్రి భువనగిరి, జగిత్యాల, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, జోగులాంబ గద్వాల, మహబూబ్ నగర్, మెదక్, మహబూబాబాద్, పెద్దపల్లి, కొమరం భీం ఆసీఫాబాద్, నారాయణ్ పేట్, జయశంకర్ భూపాల పల్లి, సూర్యాపేట, ఖమ్మం జిల్లాలలో 90 శాతానికి పైగా సర్వే పూర్తయింది. హన్మకొండ(75.7 శాతం), మేడ్చల్ మల్కాజ్‌గిరి (71.2 శాతం) మినహా మిగతా జిల్లాల్లో 80 శాతానికి పైగా సర్వే పూర్తయింది. జి.హెచ్.ఎంసీ పరిధిలో కూడా సర్వే ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. గురువారం నాటికి జిహెచ్ ఎంసీ పరిధిలో 25,05,517 నివాసాలు సర్వే చేయాల్సి ఉండగా 15,17,410 నివాసాలు సర్వే పూర్తిచేసి 60.60 శాతం లక్ష్యాన్ని సాధించింది.

### తెలంగాణ తల్లి విగ్రహ
## ఏర్పాటు పనులు పరిశీలించిన సీఎం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



హైదరాబాద్‌లోని డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని డిసెంబర్ 9న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్నారు. శుక్రవారం విగ్రహ ఏర్పాటుకు సంబంధించిన పనులను సీఎం పరిశీలించారు. అక్కడ పని చేస్తున్న కూలీలను పలకరించారు. పనులు జరుగుతున్న తీరు, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు.

## పార్లమెంట్ సమావేశాల్లో 16 బిల్లులు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సోమవారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఐదు కొత్త బిల్లులతో సహా 16 బిల్లులను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఈ మేరకు కేంద్రం వక్ఫ్ బిల్లుతో సహా 16 బిల్లులకు జాబితాను సిద్ధం చేసింది. ఈ సమావేశాల్లో జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) తన నివేదికను సమర్పించిన తరువాత, ఉభయ సభల పరిశీలన, ఆమోదం కోసం వివాదాస్పద వక్ఫ్ (సవరణ) బిల్లుకూ జాబితా చేసింది. ఐదు కొత్త బిల్లులతో పాటు సహకార యూనివర్సిటీ ఏర్పాటుకూ బిల్లును ప్రవేశపెట్టనుంది. అయితే గత వర్షాకాల సమావేశాల్లో లోక్‌సభలో ప్రవేశపెట్టిన తరువాత జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపిన వక్ఫ్(సవరణ) బిల్లుపైనే అందరి దృష్టి ఉండనుంది. శీతాకాల సమావేశాల మొదటి వారం చివరి రోజున ప్యానెల్ తన నివేదికను సమర్పించడం తప్పనిసరి. వక్ఫ్ బిల్లును పరిశీలిస్తున్న జేపీసీ పదవీకాలాన్ని పొడిగించాలని ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికే కోరడంతో ప్రస్తుత సెషన్‌లో గందరగోళం నెలకొనే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ బిల్లులో ప్రతిపాదించిన అనేక సవరణలను ప్రతిపక్షాలు, ముస్లిం సంస్థలు వ్యతిరేకించాయి. ఈ శీతాకాల సమావేశాల్లో 11 పెండింగ్ బిల్లులతో సహా మొత్తం 16 బిల్లులు ప్రభుత్వం లోక్‌సభ, రాజ్యసభ సెక్రటేరియట్‌లకు సమర్పించిన జాబితాలో భాగంగా ఉన్నాయి.

## సాయిరెడ్డిది సీఎం సోదరులు చేసిన హత్యనే

- కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సీఎం స్వగ్రామమైన కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ పాముకుంట్ల సాయిరెడ్డిది ఆత్మహత్య కానే కాదు.. ముఖ్యమంత్రి సోదరులు చేసిన హత్యనే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పోలీసులు సూసైడ్ నోట్ ఆధారంగా అనుముల బ్రదర్స్ పై కేసు నమోదుచేసి సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బ్రదర్స్ అరాచకాలు తట్టుకోలేక సీఎం స్వగ్రామమైన కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ పాముకుంట్ల సాయిరెడ్డి ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరం. ఇది ఆత్మహత్య కానే కాదు.. ముఖ్యమంత్రి సోదరులు చేసిన హత్య ఇది. అన్నారు. ఆరు నెలల క్రితం ఒక యూట్యూబ్ చానల్ కు ఇంటర్వ్యూ ఇచ్చారనే కక్షతో.. 40 ఏళ్ల క్రితం కట్టుకున్న ఇంటి ముందు పశువుల దవాఖానాను కట్టడమే కాకుండా.. సీఎం ఆదేశాలతో ఇంటికి దారి కూడా లేకుండా అడ్డంగా గోడ కట్టేందుకు పూనుకోవడంతోనే తీవ్ర మనస్థాపానికి గురై సాయిరెడ్డి ఆత్మహత్య చేసుకున్నారని పేర్కొన్నారు. "రెండుసార్లు కొండారెడ్డిపల్లికి సర్పంచ్‌గా ఎన్నో సేవలందించిన వ్యక్తిని గౌరవించాల్సింది పోయి, 85 ఏళ్ల వయస్సున్న పెద్దాయన అని కూడా చూడకుండా గత కొన్ని నెలలుగా వేధింపులకు గురిచేయడంతో తట్టుకోలేకే చివరికి పురుగుల మందుతాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆత్మహత్యకు ముందు సూసైడ్ నోట్ లో చాలా స్పష్టంగా ముఖ్యమంత్రి బ్రదర్స్ తనపై కక్ష కట్టడం వల్లే చనిపోతున్నానని సాయిరెడ్డి స్పష్టంచేసిన నేపథ్యంలో.. దీనికి సీఎం రేవంత్ రెడ్డి పూర్తి బాధ్యత వహించాలి. పోలీసులు సూసైడ్ నోట్ ఆధారంగా కేసు నమోదుచేసి సమగ్ర దర్యాప్తు జరిపించాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# కొండారెడ్డి పల్లి మాజీ సర్పంచ్ ఆత్మహత్య

- సీఎం రేవంత్ రెడ్డి అన్నదమ్ములు కక్ష కట్టారని సూసైడ్ నోట్..

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

నాగర్‌కర్నూలు జిల్లా వంగనూరు మండలం పాములకుంట్ల కొండారెడ్డి పల్లి మాజీ సర్పంచ్ సాయిరెడ్డి పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి స్వగ్రామం కొండారెడ్డి పల్లిలో మాజీ సర్పంచ్ ఆత్మహత్య చేసుకోవడం సంచలనం రేపుతోంది. తన మరణానికి సీఎం సోదరులే కారణం అంటూ మరణ వాంగ్మూలం రాసి ఆత్మహత్య చేసుకోవడంతో సంచలనంగా మారింది.



వివరాలలోకి వెళ్తే మాజీ సర్పంచ్ పాంకుంట్ల సాయిరెడ్డి గత 40 సంవత్సరాల నుంచి కొండారెడ్డిపల్లిలో జీవనం కొనసాగిస్తున్నారు. ఆయన ఇంటికి సంబంధించి దారి విషయంలో సీఎం సోదరులతో గత కొన్నిరోజులుగా వివాదం చెలరేగడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు సాయిరెడ్డి రాసిన సూసైడ్ నోట్ ఆధారంగా తెలుస్తోంది. అయితే పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



### నేరం రుజువైతే
## అదానీతో ఒప్పందాలను రద్దు చేసుకుంటాం

- టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



నేరం రుజువైతే అదానీతో కాంగ్రెస్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకుంటామని టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎంపీ సురేష్ శెట్కార్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత అదాని, అంబానీల ఆస్తులు వందల రెట్లు పెరిగిపోయాయన్నారు. వారికి వ్యాపార విస్తరణకు మోడీ వెసులుబాటు కల్పించారని ఆరోపించారు. అదానీ స్టాక్ మార్కెట్‌ను ప్రభావితం చేశారని విమర్శించారు. అదానీపై ప్రధాని ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. అదానీ అరెస్ట్ అయితే ప్రధానమంత్రి రాజీనామా చేయక తప్పదని హెచ్చరించారు. అందుకే మోడీ అదానీపై నోరు మెదపడం లేదని ఎద్దేవా చేశారు. అదానీ మోసాల్లో ప్రధానికి కూడా ప్రధాన భాగస్వామ్యం ఉందని ఆరోపించారు. అదానీ స్కిల్ యూనివర్శిటీకి రూ. 100 కోట్లు ఇచ్చారని తెలిపారు. అందుకు మాజీ మంత్రి కేటీఆర్ రూ. 50 కోట్లు ఇచ్చిన తీసుకుంటామని తెలిపారు. డబ్బు వ్యామోహం కన్న రాజకీయం వ్యామోహంతో చేసే పనులు ఎంతోప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. అదానీకి తెలంగాణలో గుంట భూమి కూడా ఇవ్వలేదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అదానీ న్యాయంగా ఒప్పందాలు చేసుకుంటే తమకు అభ్యంతరం లేదన్నారు.చట్ట ప్రకారం ఎవరు వ్యాపారం చేసిన తమకు అభ్యంతరం లేదన్నారు. చట్ట ఉల్లంఘనలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పేద ప్రజల అభ్యున్నతే తమ పార్టీ విధానమన్నారు. ఈ విషయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. నేరం రుజువైతే అదానీతో కాంగ్రెస్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకుంటామని తేల్చి చెప్పారు. అదానీ అరెస్టయితే అనేక అంశాలు బయటకు వస్తాయన్నారు. మోడీ ప్రభుత్వంలో ఆయన వేల కోట్ల లబ్ధి పొందారని తెలిపారు. అదానీ ఆగడాలపై రాహుల్ ఎన్నిసార్లు ప్రశ్నించినా మోడీ కనీసం స్పందించలేదని విమర్శించారు. అర్హత లేకున్నా అదానీ రుణాలు పొందారనీ, ఆయన వల్ల ప్రజలపై పెను భారం పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక దేశాలనూ అదానీ మోసం చేశారని విమర్శించారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన అదానీని వెంటనే అరెస్టు చేయాలని, జాయింట్ పార్లమెంటరీ కమిటీతో సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. దీనికి బాధ్యత వహిస్తూ...ప్రధాని మోడీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.




## రాష్ట్రానికి మత్స్య అవార్డు..

- అభినందించిన సీఎం రేవంత్

వివరాలు 2వ పేజీలో

# అదానీతో చేసుకున్న ఒప్పందాలు రద్దు చేయాలి..

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అదానీతో చేసుకున్న ఒప్పందాలన్నింటినీ రద్దు చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. అదానీ వ్యవహారంపై తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. "అదానీ బండారం మళ్లీ అంతర్జాతీయంగా బయటపడింది. అమెరికా నుంచి ఆఫ్రికా సహా దేశంలో ఆయన వ్యవహారంపై ప్రకంపనలు మొదలయ్యాయి. అదానీపై కేసు పెట్టాలని, జేపీసీ వేయాలని ఎన్నిసార్లు కోరినప్పటికీ ప్రధాని మోడీ పట్టించుకోలేదు. అదానీ

మిగితా 2వ పేజీలో



# అటవీశాఖ అధికారులతో మంత్రి సమీక్ష



**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్ర సచివాలయంలోని అటవీ, పర్యావరణ శాఖ అధికారులతో మంత్రి కొండా సురేఖ సుదీర్ఘ సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు టైగర్ రిజర్వ్ ల గవర్నింగ్ బాడీస్ విధివిధానాలను వివరించగా ఆయా ప్రాంతాల్లో ఎకో టూరిజంను అభివృద్ధి చేయడంపై పలు సూచనలు చేశారు. కాగా, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లోని నాలుగు గ్రామాలను పునారావ కేంద్రాలకు తరలిస్తున్నట్లుగా అటవీ అధికారులు మంత్రి వివరించారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్ లోని మైసంపేట్, రాంపూర్ గూడేలను తొలి విడతగా ఖాళీ చేయిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు ప్రభుత్వం పట్ల విశ్వాసాన్ని కల్పిస్తూ.. పునరా వాస చర్యలు విజయవంతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వన్యప్రాణుల దాడుల ఘటనల్లో మరణించిన వారికి ఇచ్చే నష్టపరిహారాన్ని.. రూ. 10 లక్షల నుండి రూ. 20 లక్షలకు పెంచే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు మంత్రి సురేఖ తెలిపారు. 'స్టేట్ లెవల్ కమిటి ఫర్ మిటిగేటింగ్ హ్యూమన్ యానిమల్ కాంఫ్లిక్ట్'తో పూర్తిస్థాయి చర్చల తర్వాత పరిహారం పెంపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లు తెలంగాణ రాష్ట్రానికి ఎంతో ప్రత్యేకతను చేకూర్చాయని అభిప్రాయపడ్డారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని మన్ననూర్, మద్దిమడుగు, సోమశిల – దోమలపెంట ఎకో టూరిజం సర్క్యూట్లలో.. ప్రస్తుతం పర్యాటక సేవలు అందిస్తున్నట్లు మంత్రి సురేఖకు వివరించారు. సోమశిల, అమరగిరి ఎకో టూరిజం సర్క్యూట్, దోమలపెంట– శ్రీశైలం ఎకో టూరిజం సర్క్యూట్‌లను రాబోయే రోజుల్లో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఇక, పెరుగుతున్న పులుల ఆహార లభ్యతకు అనుగుణంగా.. జింకల సంఖ్యను పెంచే దిశగా అటవీశాఖ చేపడుతున్న చర్యలపై మంత్రి సురేఖ హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పిసిసిఎఫ్ (హెచ్ ఓ ఎఫ్ ఎఫ్) ఆర్. ఎం. డోబ్రియాల్, పిసిసిఎఫ్ (వైల్డ్ లైఫ్) ఏలుసింగ్, డిసిసిఎఫ్ ఆంజనేయులు(హెడ్ ఆఫీస్), సిఎఫ్ రాంబాబు (అమ్రాబాద్ టైగర్ రిజర్వ్), శాంతారాం(కవ్వాల్ టైగర్ రిజర్వ్), డిఎఫ్ఓలు రోహిత్ (నాగర్ కర్నూల్), బాజీరావ్ పాటిల్ (ఆదిలాబాద్), రాజశేఖర్ (నల్గొండ), ఎఫ్ డిఓ రామ్మూర్తి, ఓఎస్డీ శంకరన్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులను ఇబ్బంది పెడుతున్న విపక్షాలు

**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు.**

**బలగం టీవి, హైదరాబాద్**



అధికారం కోల్పోయి కొంతమంది.. అధికారం కోసం రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆరోపించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగానే కొనసాగుతుందని తెలిపారు. నల్లగొండ జిల్లా కొత్తపల్లి మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరావు, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యానికి తక్షణమే చెల్లింపులు జరగడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కొత్తపల్లి ధాన్యం కొనుగోలు కేంద్ర నిర్వాహకులను మంత్రులు ప్రశంసించారు. గత ప్రభుత్వ అసమర్ధత, అవినీతి వల్ల రూ.50వేల కోట్లు సివిల్ సప్లై శాఖ బకాయి పడిందన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలో దిశ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశానికి మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి, నల్లగొండ, యాదాద్రి ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు హాజరయ్యారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా పని చెయ్యాలన్నారు. సన్నాల సాగుపై గత ప్రభుత్వానికి నిర్దిష్ట లక్ష్యం లేదని తెలిపారు. అన్నిరంగాల్లో గత ప్రభుత్వం కంటే కాంగ్రెస్ ప్రభుత్వం మెరుగ్గా పనిచేస్తుందన్నారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుకు సర్వశక్తులు ఒడ్డుతున్నామన్నారు. అధికారం కోల్పోయి కొంతమంది.. అధికారం కోసం రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే అన్ని అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకుంటుందని తెలిపారు.



## లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న మంత్రులు

**బలగం టీవి, హైదరాబాద్**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి , సీతక్క లు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన మంత్రులకు స్థానిక ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య యాదవ్, కలెక్టర్ హనుమంతరావు, ఈవో భాస్కర్ రావు, ఆలయ అర్చక బృందం అధికారిక లాంఛనాలతో స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వామి వారి దర్శనానంతరం మంత్రులకు అర్చక బృందం వేదాశీర్వచనం పలికారు. కార్తీక మాసం సందర్భంగా స్వామివారిని దర్శించుకున్నట్లుగా మంత్రులు వెల్లడించారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి యాదగిరి గుట్ట సందర్శన సందర్భంగా చేసిన ఆలయ అభివృద్ధి సమీక్ష మేరకు పనులు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## రాహుల్ గాంధీ, ఖర్గేకు రూ.100 కోట్ల పరువు నష్టం నోటీసులు

**బలగం టీవి, హైదరాబాద్**

లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు మహారాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే రూ.100 కోట్లకు పరువు నష్టం నోటీసులు పంపించారు. తన క్లయింట్‌పై వారు తప్పుడు ఆరోపణలు చేశారంటూ వినోద్ తరపు న్యాయవాది ఈ నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ నోటీసులు అందిన 24 గంటల్లో కాంగ్రెస్ నేతలు తన క్లయింట్‌కు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మూడు ఆంగ్ల, మూడు ప్రాంతీయ భాషా పత్రికల్లో మొదటి పేజీలో బహిరంగ క్షమాపణ కోరుతూ ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే వారిపై క్రిమినల్ చర్యలు చేపడతామని హెచ్చరించారు.

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని గంటల ముందు అధికార, విపక్షాల మధ్య హైడ్రామా నడిచింది. పాల్ఘర్ జిల్లాలోని విరార్ ప్రాంతంలో ఉన్న ఓ హోటల్లో బీజేపీ నేతలు డబ్బులు పంచుతున్నారని బహుజన్ వికాస్ అఘాడి పార్టీ ఆరోపించింది. బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని వినోద్ తావ్డే, ఇతర బీజేపీ నేతలు డబ్బులు పంచుతున్నట్లు ఆరోపించింది. ఇందుకు సంబంధించిన వీడియోను కాంగ్రెస్ సోషల్ మీడియా వేదికగా షేర్ చేసింది. ఎన్నికలను ప్రభావితం చేయడానికి బీజేపీ డబ్బులు పంచుతోందని ఆరోపించింది. ఈ ఆరోపణలను బీజేపీ ఖండించింది. ఈ క్రమంలో కాంగ్రెస్ అగ్రనేతలకు వినోద్ తావ్డే పరువు నష్టం నోటీసులు ఇచ్చారు.



## సామాన్యులకు, చిన్న సంస్థలకు ఆర్బిట్రేషన్ మీడియేషన్ సేవలు అందుబాటులో ఉండాలి

- **సీఎం రేవంత్‌రెడ్డి**

**బలగం టీవి, హైదరాబాద్**

సామాన్యులకు, చిన్న సంస్థలకు కూడా ఆర్బిట్రేషన్ మీడియేషన్ సేవలు అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో ప్రారంభమైన కామన్వెల్త్ ఆర్బిట్రేషన్ మీడియేషన్ సదస్సు 2024 లో పాల్గొని ప్రసంగించారు. మధ్యవర్తిత్వం నెరపడం ద్వారా సమస్యల పరిష్కారానికి ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్ చేస్తున్న కృషిని ముఖ్యమంత్రి అభినందించారు. చర్చలు, సంప్రదింపులు, మధ్యవర్తిత్వం వల్ల వివాదాలు వీలైనంత తొందరగా పరిష్కరించుకోవడానికి అవకాశం ఉందని అన్నారు. అందుకు కృషి చేస్తున్న ఐఏఎంసీ సేవలు గ్లోబల్ ఇన్వెస్టర్స్, పెద్ద పారిశ్రామిక వేత్తలకే పరిమితం కాకుండా సామాన్యులకు కూడా అందుబాటులోకి రావాలని సీఎం కోరారు.

ప్రజాస్వామ్యానికి న్యాయవ్యవస్థ మూలస్తంభమని, అయితే భారీ సంఖ్యలో పేరుకుపోతున్న పెండింగ్ కేసులు న్యాయవ్యవస్థకు సవాలుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించి వేగంగా, సమర్థవంతంగా కేసుల పరిష్కారానికి ప్రత్యామ్నాయ వ్యవస్థలు అవసరమని చెప్పారు.లండన్, సింగపూర్ తర్వాత ఆర్బిట్రేషన్ మ్యాప్‌లో హైదరాబాద్ నగరం ఉండటం గర్వకారణమని అన్నారు. ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ వంటి కొత్త ప్రణాళికలతో హైదరాబాద్ గ్లోబల్ లీడర్‌గా ఎదుగుతోందని, సాఫ్ట్‌వేర్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్, బయో టెక్నాలజీ పరిశ్రమలకు హైదరాబాద్ పవర్ హబ్‌గా ప్రపంచ గుర్తింపు పొందిందని అన్నారు. ఈ సదస్సులో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ గారు ప్రధాన ప్రసంగం చేశారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే గారు, శ్రీలంక సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏహెచ్ఎండీ నవాజ్ గారు, కామన్వెల్త్ లాయర్స్ అసోసియేషన్ ప్రసిడెంట్ డాక్టర్ పీటర్ డి.మేనార్డ్ కేసీతో పాటు న్యాయ రంగానికి చెందిన అనేకమంది ప్రముఖులు సదస్సుకు హాజరయ్యారు.

## చెరువులోకి కొత్త నిర్మాణాలు రాకుండా అడ్డుకోవడమే లక్ష్యం

- **హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్**

**బలగం టీవి, హైదరాబాద్**

ఎఫ్‌టీఎల్‌లో ఉన్న నిర్మాణాలన్నీ కూల్చివేసి చెరువులు పరిరక్షించడం హైడ్రా ఉద్దేశం కాదని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. నగర చెరువులు, నాలాల పునరుద్ధరణ, ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), సరిహద్దులు నిర్ధారణ' అనే అంశంపై హైడ్రా కమిషనర్ అధ్యక్షతన శుక్రవారం బుద్ధభవన్‌లోని తన కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'హైడ్రా బృందం ఇటీవల కర్ణాటకలో పర్యటించి వచ్చిందని, అక్కడి కర్ణాటక ట్యాంక్ కన్జర్వేషన్ అండ్ డెవలప్‌మెంట్ బోర్డు అధికారులతో భేటీ అయిందని వివరించారు. ఇక్కడ అమలులో ఉన్న విధానాలను చూసి వాళ్లు ఆశ్చర్యపోయారని, అక్కడ చెరువుల్లో పట్టా భూమి అంటూ ఉండదని తెలిపారు. మీ దగ్గర చెరువుల్లో ప్రయివేటు భూమి ఎందుకు ఉంది? అని అక్కడి అధికారులు ప్రశ్నించారన్నారు. ఎఫ్‌టీఎల్‌కు బదులుగా అక్కడ వాళ్లు మ్యాగ్జిమం వాటర్ లెవల్ (ఎండబ్ల్యూఎల్) పరిగణలోకి తీసుకుంటారన్నారు. ప్రస్తుతం ఉన్న చెరువులకు కాపాడటానికే హైడ్రా పని చేస్తుందని, కొత్తగా వచ్చే నిర్మాణాలపై మాత్రమే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అమీన్‌పూర్ పెద్దచెరువుతో పాటు మరికొన్నింటిని విషయంలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల శాస్త్రీయ నిర్ధారణ కష్టసాధ్యంగా మారిందన్నారు.

అక్రమ నిర్మాణాల నియంత్రణకు అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నామని, ఎఫ్‌టీఎల్ నిర్ధారించాక చెరువుల్లో ఏదైనా అక్రమ నిర్మాణం చేపడితే తమకు అలర్ట్ వస్తుందన్నారు.

## ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దరు హతం

**బలగం టీవి, హైదరాబాద్**

ములుగు జిల్లాలో పోలీస్ ఇన్‌ఫార్మర్ నెపంతో ఇద్దరు గిరిజనులను అత్యంత దారుణంగా హతమార్చారు. తమ కదలికలపై పోలీసులకు సమాచారమివ్వడం మానుకోవాలని పలుమార్లు చెప్పినా వినకపోవడంతో ఈ ఘటనకు పాల్పడినట్లు లేఖలో మావోయిస్టులు వెల్లడించారు. ఉనికిని చాటుకోవడం కోసమే నక్సల్స్ ఇలాంటి దారుణాలకు ఒడిగడుతున్నారని పోలీసులు తెలిపారు. ఇద్దరినీ దారుణంగా చంపడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక గిరిపుత్రులు ఆందోళన చెందుతున్నారు. ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలోని పెనుగోలులో పోలీసుల ఇన్‌ఫార్మర్ నెపంతో ఇద్దరు గిరిజనులను గొడ్డలితో అతికిరాతకంగా నరికి చంపేశారు.

మృతుల్లో ఒకరైన రమేశ్ పేరూరు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తుండగా అదేగ్రామానికి చెందిన అర్జున్ అనే గిరిజనుడు నక్సల్స్ అకృత్యానికి బలయ్యాడు. సాయుధులైన ఆరుగురు మావోయిస్టులు రెండు గ్రూపులుగా విడిపోయి ఇద్దరిని నరికి చంపినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆ ఘటనలో అర్జున్ అక్కడికక్కడే చనిపోగా తీవ్రంగా గాయపడిన రమేశ్‌ను కుటుంబీకులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన భార్య పిల్లలు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలిపించారు.ఇన్‌ఫార్మర్లుగా మారి కొన్నేళ్లుగా మావోయిస్టు కదలికలను పోలీసులకు చేరవేస్తూ తమపై దాడులకు కారకులయ్యారంటూ విడుదల చేసిన లేఖలో మావోయిస్టులు పేర్కొన్నారు. ఆ విషయంపై పలుమార్లు హెచ్చరించినా పద్ధతి మార్చుకోకపోవడంతో హతమార్చినట్లు వాజేడు, వెంకటాపురం వాజేడు కమిటీ కార్యదర్శిశాంత పేరిట ఘటనాస్థలిలో వదిలి వెళ్లిన లేఖలో మావోయిస్టులు పేర్కొన్నారు.



# 3 ఐపీఎల్ సీజన్ల తేదీలు ఒకేసారి ప్రకటన..!

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్ 2025 సీజన్ మెగా వేలం సౌదీ అరేబియాలోని జెడ్డాలో మొదలుకానుంది. రెండు రోజుల పాటు జరిగే ఈ వేలం కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే వేలం ప్రారంభం కాకముందే ఐపీఎల్ తదుపరి మూడు సీజన్‌ల తేదీని ఒకేసారి ప్రకటించనున్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి.

ఓ నివేదిక ప్రకారం తదుపరి సీజన్ మార్చి 14 నుంచి ప్రారంభమవుతుంది. ఈ టోర్నమెంట్ మే 25 వరకు కొనసాగుతుంది. అంటే ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ ముగిసిన వెంటనే టోర్నీ ప్రారంభం కానుంది. మార్చి 9న ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ జరగనుంది. బీసీసీఐ అన్ని ఐపీఎల్ ఫ్రాంచైజీలకు ఇమెయిల్ పంపినట్లు సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన ఇంకా రాలేదు. ఇక 2026, 2027 సీజన్ల తేదీలు కూడా వచ్చేశాయి. 2026 సీజన్ మార్చి 15 నుంచి ప్రారంభమై మే 31 వరకు కొనసాగుతుంది. 2027 సీజన్ కూడా మార్చి 14 నుంచి ప్రారంభమై మే 30 వరకు కొనసాగుతుంది.

2025 సీజన్‌లో మునుపటి మూడు సీజన్‌ల మాదిరిగానే 74 మ్యాచ్‌లు ఉంటాయి. లీగ్ ప్లస్ నాకౌట్ దశలో 10 జట్లు పోటీపడతాయి. లీగ్ దశలో ఒక్కో జట్టు 14 మ్యాచ్‌లు ఆడతాయి. ఈ సీజన్‌లో ప్లేఆఫ్‌లు, ఫైనల్‌తో కలిపి మొత్తం 74 మ్యాచ్‌లు జరగనున్నాయి.

# టాప్-2కు తెలుగు టైటాన్స్..

**బలగం టీవీ, హైదరాబాద్**



ప్రోకబడ్డీ లీగ్ సీజన్-11లో తెలుగు టైటాన్స్ అద్భుత ప్రదర్శన చేస్తోంది. విజయాల్లో మరో హ్యాట్రిక్ సాధించింది. నొయిడా వేదికగా గురువారం బెంగాల్ వారియర్స్‌తో జరిగిన ఉత్కంఠ భరిత మ్యాచ్‌లో 31-29 పాయింట్లతో నెగ్గింది. దాంతో మొత్తంగా ఈ సీజన్‌లో ఆడిన 12 మ్యాచ్‌ల్లో ఎనిమిదింట్లో గెలిచి 42 పాయింట్లతో టేబుల్‌లో రెండో స్థానానికి ఎగబాకింది. హర్యానా స్టీలర్స్ 9 విజయాలతో అగ్రస్థానంలో నిలిచింది.

మ్యాచ్ ఆరంభం నుంచే తెలుగు టైటాన్స్ దూకుడు ప్రదర్శించింది. బెంగాల్ వారియర్స్‌ను ఒకసారి ఆలౌట్ చేసి తొలి అర్ధభాగంలో 19-9 తేడాతో భారీ ఆధిక్యాన్ని సాధించింది. అయితే సెకండ్ హాఫ్‌లో టైటాన్స్ ఆలౌట్ అయ్యింది. కానీ ఫస్టాఫ్‌లో ఉన్న ఆధిక్యంతో అంతిమంగా మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. తెలుగు టైటాన్స్‌లో స్టాండ్‌బై కెప్టెన్ విజయ్ మాలిక్ 14 పాయింట్లతో సత్తాచాటాడు. గాయంతో పవన్ సెహ్రావత్ గత మూడు మ్యాచ్‌లకు దూరమైన విషయం తెలిసిందే. బెంగాల్ వారియర్స్ జట్టులో ప్రణయ్ రాణే 9 పాయింట్లు సాధించాడు.

# ముందు క్యూ కట్టి...
# ఆ పై వికెట్లు పడగొట్టి..

**తొలి ఇన్నింగ్స్‌లో 150 పరుగులకు భారత్ ఆలౌట్ ఆస్ట్రేలియా స్కోరు : 67/7**





**బలగం టీవీ, పెర్త్**

బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ తొలి టెస్టు తొలి రోజే ఆసక్తికరంగా ప్రారంభమైంది. ముందు భారత జట్టు ఆటగాళ్లు బ్యాటింగ్‌లో ఒకరి తర్వాత ఒకరు క్యూ కట్టి పెవిలియన్‌కు చేరారు. ఆ తర్వాత బౌలింగ్‌లో మాత్రం విజృంభించారు. వరుసగా వికెట్లు తీయడంతో మొదటి టెస్టు తొలి రోజే 17 వికెట్లు నెలకూలాయి. మొత్తానికి పెర్త్ వేదికగా తొలి టెస్టులో భారత జట్టు పట్టుబిగిస్తోంది. భారత్ స్వల్ప స్కోర్‌కే ఆలౌట్ అయినప్పటికీ కెప్టెన్ జస్ప్రీత్ బుమ్రా (4/17) విజృంభణతో ఆస్ట్రేలియాను ఆలౌట్ ప్రమాదంలో పడేసింది.

తొలి రోజు టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన భారత్ 150 పరుగులకు ఆలౌట్ కాగా తర్వాత ఆట ముగిసేసరికి మొదటి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా స్కోర్ 67-7తో ఉంది. ఆస్ట్రేలియా ఇంకా 83 పరుగుల వెనుకంజలో ఉంది. క్రీజులో అలెక్స్ కేరీ (19), మిచెల్ స్టార్క్ (6) ఉన్నారు. కెప్టెన్ బుమ్రా నాలుగు వికెట్లతో ఆసీస్ టాపార్డర్‌ను కుప్పకూల్చాడు. ఇక మహ్మద్ సిరాజ్ 2, హర్షిత్ రాణా 1 వికెట్ దక్కించుకున్నారు.

### పోరాడిన నితీశ్ కుమార్ రెడ్డి

టాస్ గెలిచిన భారత కెప్టెన్ జస్ప్రీత్ బుమ్రా బ్యాటింగ్ తీసుకున్నాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 150 పరుగులకు ఆలౌటైంది.



టీమ్‌ఇండియా బ్యాటర్లలో తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి (41 పరుగులు) టాప్ స్కోరర్. రిషభ్ పంత్ (37 పరుగులు), కేఎల్ రాహుల్ (26 పరుగులు), ధ్రువ్ జురెల్ (11 పరుగలు) మాత్రమే రెండంకెల స్కోరు సాధించారు. యశస్వి జైస్వాల్, దేవదత్ పడిక్కల్ డకౌట్ అయ్యారు. విరాట్ కోహ్లీ (5), సుందర్ (4), హర్షిత్ రాణా (7), బుమ్రా (8) ఆకట్టుకోలేదు. ఆసీస్ బౌలర్లలో జోష్ హేజిల్‌వుడ్ 4, కమిన్స్, మార్ష్ , స్టార్క్ తలో 2 వికెట్లు దక్కించుకున్నారు. తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి(41), వికెట్ కీపర్ రిషభ్ పంత్(37)లు అద్భుత పోరాటం కనబరిచారు. కేఎల్ రాహుల్ (26) నింపాదిగా ఆడాడు.

అనంతరం ఇన్నింగ్స్ మొదలెట్టిన ఆసీస్‌కు బుమ్రా ఆదిలోనే షాకిచ్చాడు. ఓపెనర్లు ఉస్మాన్ ఖవాజా(8), నాథన్ మెక్‌స్వీనే(10)లను ఔట్ చేసి భారత్‌కు బ్రేకిచ్చాడు. మార్నస్ లబూషేన్(2)ను ఔట్ చేసిన సిరాజ్ కంగారూలను మరింత కష్టాల్లో పడేశాడు. వికెట్ కీపర్ అలెక్స్ క్యారీ(19 నాటౌట్) ఒంటరిపోరాటం చేయగా ఆస్ట్రేలియా తొలి రోజు ఆట ముగిసే సరికి 7 వికెట్ల నష్టానికి 67 పరుగులు చేసింది.

# 'కన్నప్ప' నుంచి మోహన్ బాబు లుక్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

మంచు ఫ్యామిలీ నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కన్నప్ప. ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తుండగా.. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్నాడు. హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ మూవీ నుంచి విష్ణుతో పాటు ప్రముఖుల ఫస్ట్ లుక్‌లను పంచుకున్న చిత్రబృందం తాజాగా మోహన్ బాబు ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. ఈ సినిమాలో మోహన్ బాబు మహదేవ్ శాస్త్రి అనే పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది.




# 24న కిస్సిక్ సాంగ్ రిలీజ్

**బలగం టీవీ, హైదరాబాద్**



అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందించిన పాన్ ఇండియా చిత్రం 'పుష్ప-2'డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకురాబోతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో అల్లు అర్జున్, శ్రీలీలపై చిత్రీకరించిన 'కిస్సిక్..' అనే ప్రత్యేకగీతాన్ని ఈ నెల 24న చెన్నైలో జరిగే ఈవెంట్‌లో రిలీజ్ చేయబోతున్నారు. ఈ సందర్భంగా గురువారం పాట తాలూకు స్టిల్‌ను విడుదల చేశారు.

# తండేల్ నుంచి మెలోడీ సాంగ్ 'బుజ్జి తల్లి'

**బలగం టీవీ, హైదరాబాద్**

నాగ చైతన్య, సాయి పల్లవి నటిస్తున్న చిత్రం 'తండేల్'. తాజాగా మేకర్స్ ఫస్ట్ సింగిల్- బుజ్జి తల్లి లిరికల్ వీడియోను విడుదల చేశారు.చందూ మొండేటి దర్శకత్వం వహించిన ఈ మూవీలోని ఈ సాంగ్ లీడ్ పెయిర్ ఎమోషనల్ జర్నీని అందంగా చూపించింది. రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ కంపోజ్ చేసిన ఈ ట్రాక్ మ్యాజికల్‌గా ఉంది. హీరో బాధలో ఉన్న ప్రియురాలిని ఓదార్చడానికి ప్రయత్నిస్తున్నప్పుడు కథలో కీలకమైన సమయంలో ఈ సాంగ్ వస్తుందని తెలుస్తోంది. లిరికల్ వీడియో ద్వారా లీడ్ పెయిర్ అనుబంధాన్ని అద్భుతంగా చూపించారు. శ్రీమణి రాసిన లిరిక్స్, తన ప్రేమికురాలిని ఓదార్చడానికి ప్రయత్నిస్తున్న హీరో భావోద్వేగాలను కవితాత్మకంగా చూపించాయి. బుజ్జి తల్లి లవ్ సాంగ్ ఆఫ్ ది ఇయర్ అంటూ మేకర్స్ పాటను విడుదల చేశారు. అల్లు అరవింద్ సమర్పణలో ప్రతిష్టాత్మక గీతా ఆర్ట్ బ్యానర్‌పై బన్నీ వాస్ నిర్మించిన ఈ చిత్రం గ్రామంలో జరిగిన యదార్థ సంఘటనల స్ఫూర్తితో రూపొందింది. తండేల్ మూవీ ఫిబ్రవరి 7న విడుదల కానుంది.



# అన్నపూర్ణ స్టూడియోలో డాల్బీ టెక్నాలజీ

**బలగం టీవీ, హైదరాబాద్**

దేశంలో ఎక్కడా లేని విధంగా ఈ డాల్బీ టెక్నాలజీకి సంబంధించిన ఏర్పాట్లు తమ స్టూడియోలో(అన్నపూర్ణ) చేసినట్టు నటుడు నాగార్జున తెలిపారు. భారతీయ అంతర్జాతీయ సినిమా పండుగ (ఇఫ్ఫీ) వేడుకలో ఆయన మాట్లాడుతూ "డాల్బీ విజన్‌లో ఆర్ఆర్ఆర్‌ను తెరకెక్కించాలని దర్శకుడు రాజమౌళి అనుకున్నప్పుడు, ఇండియాలో దానికి సంబంధించిన సదుపాయాలు లేవు. దీంతో ఆయన జర్మనీ వెళ్లి మరీ ఆ పనులను పూర్తి చేశారు. అప్పుడే ఆ టెక్నాలజీని ఇక్కడకీ అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించుకున్నాము. ఇప్పుడు మేం డాల్బీని మా స్టూడియోలో ఏర్పాటు చేశాం. పుష్ప 2 చిత్రంతో మేం దానిని ప్రారంభిస్తున్నాం. ఇదే మొదటి సారి కావడం ఆనందంగా ఉంది" అని అన్నారు.